మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

## పేదలకు అండ.. సీఎం రిలీఫ్ ఫండ్...

**కల్వకుర్తి, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త :** సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందారని, నిరుపేదలు ఎంతో ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ప్రాణాలతో జీవిస్తున్నారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. కల్వకుర్తి మండలం తిమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన బర్రె గోపాల్‌కు ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మంగళవారం క్యాంప్ కార్యాలయంలో బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరప్రధాయినిగా నిలుస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, కోఆప్షన్ సభ్యులు మనోహర్, నాయకులు బాలయ్య, కుర్మయ్య, బంగారి తదితరులు ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## వెల్‌నెస్ కేంద్రం ద్వారా మెరుగైన వైద్యసేవలందించాలి

- వెల్‌నెస్ కేంద్రంలో అవసరమైన మందులు, యంత్ర పరికరాలకు సహకారం అందిస్తాం
- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రం ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు కోరారు. మంగళవారం ఆయన వెల్‌నెస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్‌నెస్ కేంద్రంలో డాక్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఖాళీ పోస్టుల గురించి వెల్‌నెస్ కేంద్రం ఇంఛార్జి డా. ప్రశాంతితో ఆరా తీశారు. అలాగే మందుల సరఫరాకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించడమే కాకుండా ఫార్మసిని తనిఖీ చేసి ఎలాంటి మందులు ఉన్నాయని? ఫార్మసిస్టును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్లతో మాట్లాడుతూ ప్రతిరోజు ఎంతమంది రోగులు వెల్‌నెస్ కేంద్రానికి వస్తున్నారని అడగగా 80-90 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నట్లు డా. ప్రశాంతి జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. వెల్‌నెస్ కేంద్రంలో అవసరమైన మందుల కొరతను గమనించిన జిల్లా కలెక్టర్ తక్షణమే సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుండి మందులు తీసుకునేందుకు ఇండెంట్ పెట్టాలని సూచించారు. అంతేకాక వెల్‌నెస్ కేంద్రంలో ఉన్న ఈసీజి యంత్రం పనిచేయడం లేదని తెలుసుకుని తక్షణమే దానిని రిపేర్ చేయించాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం ఫైల్ సమర్పించాలని ఆదేశించారు. వెల్‌నెస్ కేంద్రానికి కూడా పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నందున ఇక్కడి నుండి కూడా మెరుగైన వైద్య సేవలందించేందుకు వెల్‌నెస్ కేంద్రం డాక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



వెల్‌నెస్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్

**ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్..**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన ఈవీఎం గోదాము వద్ద భద్రతను యధావిధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. ఈవీఎం గోదాము నెలవారి తనిఖీలో భాగంగా మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును తనిఖీ చేశారు. పోలీస్ సమక్షంలో ఆయన సిబ్బందిచే ఈవీఎం గోదామును తెరిపించి గోదాములో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తనిఖీ చేసిన అనంతరం తిరిగి ఈవీఎం గోదామును సీల్ చేయించారు. అంతేకాక ఈవీఎం గోదాం చుట్టు తిరిగి భద్రతను పరిశీలించారు. భద్రత ఏర్పాటును ఇలాగే కొనసాగించాల్సిందిగా ఆయన ఆదేశించారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్ జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## దళితుని ఇంట్లో భోజనం చేస్తే సహించలేని మంత్రి

- దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మాచారి

**మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** కేంద్ర మంత్రి సామాన్య దళిత కుటుంబంలో భోజనం చేయడాన్ని స్థానికి మంత్రి జీర్ణించుకోకపోవడం బాధాకరమని బీజేపీ జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మాచారి అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని పేదల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ఏ విధంగా అమలు జరుగుతుందో తెలుసుకోవడానికి వచ్చిన కేంద్ర మంత్రిని అవమానపరిచే విధంగా టీఆర్ఎస్ స్థానిక మంత్రి మాట్లాడటం విచారకరమన్నారు. కేంద్ర నిధులతో రహదారులు నిర్మాణం చేస్తుంటే వాటిపై మొక్కలు నాటి అంతా మేమే చేస్తున్నామని ఫోటోలు దిగిప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి పెండింగ్ పనుల గురించి ఏనాడు అసెంబ్లీలో మాట్లాడని మంత్రికి కేంద్రమంత్రిని విమర్శించే స్థాయి ఎక్కడిదని ప్రశ్నించారు. ఎలాంటి డిపీఆర్‌లు పంపించకుండా అనధికారికంగా నిర్వహిస్తున్న పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలంటూ కోరడం సరైందికాదన్నారు. మంత్రి వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అచ్చుగట్ల అంజయ్య, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మాచారి

## సంఘం శరణం గచ్ఛామి కళా ప్రదర్శనను జయప్రదం చేయండి

- జడ్పీ ఛైర్‌పర్సన్ పెద్దపల్లి పద్మావతి బంగారయ్య



కరపత్రాలను విడుదల చేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్

**నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నేడు సాయి గార్డెన్‌లో నిర్వహించే సంఘం శరణం గచ్ఛామి కళా ప్రదర్శనను జయప్రదం చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మావతి బంగారయ్య పిలుపునిచ్చారు. మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, అట్టడుగు వర్గాల ప్రజల కోసం పని చేసిన డా.బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను కళారూపంలో ప్రదర్శించడం శుభసూచకమని ప్రతి ఒక్కరు తిలకించి ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్, జిల్లా ఎస్పీ కె. మనోహర్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ హనుమంతరావు, ఎస్సీ, ఎస్టీ, బిసి జాతీయ అధ్యక్షులు జెట్టి ధర్మరాజు, వంకేశ్వరం నిరంజన్, ఎంఈఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్, బహుజన సంఘాల జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శివప్రసాద్‌లు హాజరవుతున్నారని అన్నారు. అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా ఉన్న అంబేద్కర్ జీవితమే ప్రజలందరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కెవిపిఎస్ ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ప్రజా పోరాటాలే కాకుండా మహనీయుల చరిత్రను ఇలా ప్రజలందరికి తెలియజేసే విధంగా కృషి చేయడం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో మాదిగ జెఎసి జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి అభిమాని పృథ్వీరాజ్, రాజేష్, సురేష్, రాజు తదితరులు ఉన్నారు.

## గణేష్ నిమజ్జనానికి రూట్‌మ్యాప్ ద్వారా బందోబస్తును పరిశీలించిన జిల్లా ఎస్పీ

- మక్తల్ ట్యాంక్‌బండ్, ఉట్కూర్ పెద్దచెరువును పరిశీలించిన జిల్లా ఎస్పీ

**మక్తల్, సెప్టెంబరు 06, ప్రభాతవార్త :** ఉట్కూర్ మండల కేంద్రాలలో వినాయక నిమజ్జనం శోభాయాత్ర సందర్భంగా జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు పోలీస్ స్టేషన్లలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి రూట్‌మ్యాప్‌ను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం రూట్‌మ్యాప్ ద్వారా వినాయక విగ్రహాలు వెళ్లే రూట్లను, గణేష్ నిమజ్జనం చేసే ట్యాంక్‌బండ్, పెద్దచెరువులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ 8వ తేదీన ఉట్కూర్‌లో, 10వ తేదీన మక్తల్‌లో వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ట్యాంక్‌బండ్, పెద్ద చెరువల దగ్గర నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయించాలని తెలిపారు. అలాగే చెరువుల దగ్గర పెద్ద విగ్రహాలు చెరువులో వేయడానికి క్రేన్స్ ఏర్పాటు చేయాలని, చెరువుల పరిసర ప్రాంతంలో లైటింగ్ వేయించాలని ప్రజలు ఎవరు చెరువుల దగ్గరికి వెళ్లకుండా బారికేడ్స్ ఏర్పాటు చేయించాలని సూచించారు. వినాయక విగ్రహాలు వెళ్లే రూట్ మార్గాలలో ప్రార్థనా మందిరాల దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సెన్సిటివ్ ఏరియాలలో పికెట్స్ ఏర్పాటు చేయాలని ఎస్పీ తెలిపారు. గణేష్ శోభాయాత్ర చూడడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి దొంగతనాలు జరగకుండా మఫ్టీలో పోలీస్ ఐడి పార్టీలను ఏర్పాటు చేయాలని, కానీలలో ఎలాంటి దొంగతనాలు జరగకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని, వారం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండేలా సూచనలు ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. గణేష్ నిమజ్జనానికి పోలీసులతో పాటు బందోబస్తుకు స్వచ్ఛందంగా సేవలందించడానికి వస్తున్న వాలంటీర్లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్పీతో పాటు మక్తల్ సీఐ సీతయ్య, ఆర్ఐ కృష్ణయ్య, ఎస్సైలు పర్వతాలు, రాములు, శివనాగేశ్వర నాయుడు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ



రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

## అనారోగ్యంతో బాధపడుతున్న యాదగిరి.. చికిత్స కోసం రూ.లక్ష ఎల్‌ఓసీ అందజేత

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న వనపర్తి పట్టణం యూకో బ్యాంక్ కాలనీకి చెందిన యాదగిరి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీ ని హైదరాబాద్ లోని బంజారా హిల్స్ మంత్రుల నివాస సముదాయంలోని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో లబ్దిదారునికి అందజేశారు. అందజేసిన వారిలో ఓఎస్‌డీలు సంగమేశ్వర్ రావు, జనార్దన్ రావు, పీఏ రాజగోపాల్ తదితరులు ఉన్నారు.



బాదితునికి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఓఎస్‌డీలు సంగమేశ్వరావు, జనార్దన్ రావు

## కాంగ్రెస్ పార్టీ ఆత్మీయుల సమావేశంలో పాల్గొన్న అభిలాష్‌రావు



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ యువ నాయకులు రంగినేని అభిలాష్‌రావు

**పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 06, ప్రభాతవార్త :** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ యువ నాయకులు రంగినేని అభిలాష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తగిలి కృష్ణయ్య మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేలా ప్రతిఒక్క కాంగ్రెస్ కార్యకర్త గ్రామ అధ్యక్షునితో కలిసి కట్టుగా పనిచేసే విధంగా కృషి చేయాలని కోరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు అవలంబిస్తున్న తీరును, సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతున్న ముడిచమురు ధరలు, నిత్యావసర ధరలను ఎండగట్టే విధంగా ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి కంటె శివన్న, జిల్లా సేవాదళ్ జనరల్ సెక్రెటరీ రఫీఉద్దిన్, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, వీపనగండ్ల మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్ పాల్గొన్నారు.

## పాలమూరు జిల్లాలో వైఎస్సార్ చేపట్టిన అభివృద్ధే కనిపిస్తోంది..

- ఆశీర్వదిస్తే వైఎస్సార్ పథకాలను బ్రహ్మాండంగా అమలు చేస్తా..
- తెలంగాణలో నిరుద్యోగం పెరిగింది
- నిరుద్యోగ సమస్యను పట్టించుకోని సీఎం కేసీఆర్
- హామీలను విస్మరించిన కేసీఆర్ ప్రభుత్వానికి పతనం తప్పదు..
- వైఎస్ఆర్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

**కల్వకుర్తి, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** వలసల జిల్లాగా పేరొందిన ఉమ్మడి పాలమూరు జిల్లాలో వైఎస్సార్ చేపట్టిన అభివృద్ధే నేటికి కనిపిస్తుందని వైఎస్ఆర్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వైఎస్సార్ కట్టాలనుకున్న ప్రాజెక్టు అని, నాన్నగారు బ్రతికి ఉంటే ఈ ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని ఆమె సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కల్వకుర్తి ప్రాంతానికి అదనంగా లక్షన్నర ఎకరాలకు నీళ్లు వచ్చేవని, నేటికి ప్రాజెక్టును పూర్తి చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, ప్రాజెక్టుల పేరుతో కమీషన్లకు కక్కుర్తి పడుతుంది కానీ ప్రాజెక్టులను పూర్తి చేయాలనే సదుద్ధేశ్యం తెలంగాణ ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య భారీగా పెరిగిందని, 8 ఏళ్లుగా నిరుద్యోగ సమస్యను కేసీఆర్ పట్టించుకోవడం లేదని, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వైఎస్ఆర్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల చేపట్టిన ప్రజా ప్రస్థాన పాదయాత్ర మంగళవారం కల్వకుర్తి మండలం తర్నికల్, తుర్కలపల్లి, గుండుర్ గ్రామాల చౌరస్తా, సుద్ధకల్ గ్రామాల మీదుగా తాడూర్ మండలానికి బయలుదేరింది. వైఎస్ షర్మిల పాదయాత్రకు మహిళలు, యువకులు డప్పు మేళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ఆయా గ్రామాల గుండా పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాటల గారడిచే మభ్య పెడుతున్న సీఎం కేసీఆర్‌కు పాలన చేతకాదని, ఆయనది దిక్కుమాలిన పాలనని విమర్శించారు. రుణమాఫీ, మహిళలకు వడ్డీ లేని రుణాలు, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, కేజీ టూ పీజీ ఉచిత విద్య, మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, పోడు భూములకుపట్టాలు ఇస్తానని చెప్పి మాటల గారడిల చేత మాయ చేశాడని ఎద్దేవా చేశారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు చిరస్థాయిగా నిలిచాయన్నారు. వైఎస్ఆర్‌కు మరణం లేదని పాదయాత్రలో అది స్పష్టంగా కనిపిస్తున్నదని, ఆయన చూపిన సంక్షేమ పథకాలను ప్రజలు ఇప్పటికి గుర్తుంచుకుంటు న్నారని, ప్రజల అభిమానమే తనను ముందుకు నడిపిసుత ఒదన్నారు. 46 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా పక్క ఇల్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బంగారు తెలంగాణ అని చెప్పి అప్పుల తెలంగాణగా చేశారని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలోనే సీఎం కేసీఆర్ బయటకు వస్తారని, ఉద్యోగ నోటిఫికేషన్లు అన్ని కొత్త మోసం మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన 50 వేల నోటిఫికేషన్లు అంటారని, దుబ్బాక, హుజురాబాద్, నాగార్జునసాగర్ ఉప ఎన్నికలకు అదే 50 వేల ఉద్యోగాలు అని, రీల్ తిప్పారని చెప్పారు. ఇప్పుడు మునుగోడు ఎన్నికలు వచ్చాయని, మళ్లీ 50వేల ఉద్యోగాలు అని ఊరిస్తూ త్వరలో 50వేల ఉద్యోగాలు మాట ముందుకొ తీసుకొస్తారని జోస్యం చెప్పారు. ఎన్నికలకు ముందు స్విచ్ వేయడం, ఎన్నికల తర్వాత స్విచ్ ఆఫ్ చేయడం సీఎం కేసీఆర్‌కు మాత్రమే తెలుసునన్నారు. ఉద్యోగాలు ఇవ్వాలంటే ఎన్నికలే కావాలా అని ప్రశ్నించారు. ఎప్పుడంటే అప్పుడు నోటిఫికేషన్లు విడుదల చేయొచ్చు కదా అన్నారు. సీఎం కేసీఆర్ మాయ మాటలు చెప్పడం మాని ఇకనైన పాలను దక్షితను గౌరవించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. కేసీఆర్‌ను ప్రశ్నించడంలో బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు దొందు దొందేనని, రాష్ట్రంలో కా ంగ్రెస్‌తో, దేశంలో బీజేపీతో దోస్తీ చేసి ప్రజలను మసి బూసి మారేడు కాయ చేస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ హయంలో వ్యవసాయ పండుగలా ఉండేదని, నేడు రైతుల కోసం తీసుకొచ్చానని చెప్పుకోస్తున్న పథకాలు రైతులకు తప్ప దళారులకు బాగా పనికొస్తున్నాయని ఆమె ఘాటుగా విమర్శించారు. ఆశీర్వదిస్తే వైఎస్సార్ పథకాలను బ్రహ్మాండంగా అమలు చేస్తానని హామీ ఇస్తూ పాదయాత్ర ముందుకు కొనసాగించారు. తర్నికల్ గ్రామంలో రైతులతో, మహిళా కూలీలతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా రైతులు అన్నం తింటూ షర్మిలకు తినిపించి ప్రేమ అప్యాయతను చాటారు. వైఎస్సార్ మీద ప్రేమ ఎప్పటికి అలానే ఉంటుందని మహిళా రైతులు షర్మిలతో చెప్పుకొచ్చారు. పాదయాత్రలో గౌడన్నతో మాట్లాడి గౌడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాలమూరు జిల్లా పరిశీలకులు శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి కోఆర్డినేటర్ చీమర్ల అర్జున్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు నరసింహగౌడ్, కల్వకుర్తి మండల అధ్యక్షులు పుట్టా శేఖర్, తలకొండపల్లి మండల అధ్యక్షులు తిరుపతి, ఆమనగల్లు మండల అధ్యక్షులు రహీం, నాయకులు జహంగీర్, సంజీవ్, మధు, సూరి, సాయి, నితీష్ తదితరులు ఉన్నారు.



షర్మిలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



పాదయాత్రలో గౌడన్నతో షర్మిల



షర్మిలకు అన్నం తినిపిస్తున్న మహిళా రైతు

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్



వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

**ఊర్కొండ, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ అన్నారు. ఊర్కొండ మండలం మాధారం గ్రామంలో భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడి వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నిచల్‌రెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్ర శేఖర్ మాట్లాడుతూ ప్రజలంతా పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు గణనాథుడిని పూజించాలని, ఈ యేడాది పాడి పంటలతో రైతులు సుఖ సంతోషాలతో మెలుగాలని వేడుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎర్ర శేఖర్, ధ్యాప నికిల్‌రెడ్డితో పాటు పలువురిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

## గ్రామాలలో కొనసాగిన కొత్త పింఛన్ల పంపిణి

**ఇటిక్యాల, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అర్హులైన వారికి పింఛన్ల మంజూరు చేయడంతో మండలానికి 14 వందల 15 పింఛన్లు మంజూరు కాగా సోమ వారం మండల కేంద్రం లో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం జెడ్పి చైర్మన్ సరిత తిరుపతయ్యలు ప్రతి గ్రామం నుండి హాజ రైన లబ్దిదారులకు పింఛ న్ మంజూరు ధ్రువపత్రా లు గుర్తింపు కార్డులను స్థానిక ఎంపిపి స్నేహ శ్రీధర్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు రెడ్డి, సింగల్‌విండో చైర్మన్ రంగారెడ్డి, ఎంపిడిఓ రాఘవ ఆధ్వర్యంలో పంపిణి చేశారు. మంగళవారం నుండి గ్రామాలల్లో సర్పంచులు, ఎంపిటిసిలు పంచాయితీ కార్యదర్శులు స్థానిక టిఆర్‌ఎస్ గ్రామ పంచాయితీలో ఎంపిపి స్నేహ శ్రీధర్‌రెడ్డి స్థానిక గ్రామ సర్పంచు మల్లన్న ఆధ్వర్యంలో పింఛన్‌దారులకు మంజూరు ధృవపత్రాలు గుర్తింపు కార్డులనువారు పంపిణి చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సర్పంచులు, ఎంపిటిసిలు పంచాయితీ కార్యదర్శులు స్థానిక గ్రామ టిఆర్‌ఎస్ నాయకలతో కలిసి పింఛన్ లబ్దిదారులకు మంజూరు ధృవపత్రాలు గుర్తింపు కార్డులను పంపిణి చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కొత్త పింఛన్ల పంపిణి ఒక యజ్ఞంలా కొనసాగించారు.



శాసనూలులో పింఛన్లను పంపిణి చేస్తున్న ఎంపిపి స్నేహ శ్రీధర్‌రెడ్డి

## పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్య భద్రత...

### - మరుగుదొడ్లను తప్పనిసరిగా వినియోగించాలి...

### - ప్రత్యేకాధికారిణి, ఎంపీడీఓ జయసుధ



గ్రామంలో పర్యటిస్తున్న ప్రత్యేకాధికారిణి, ఎంపీడీఓ జయసుధ

**వంగూరు, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన గ్రామాల్లో ప్రత్యేక చొరవ తీసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజల ఆరోగ్యానికి భద్రత ఉంటుందని ప్రత్యేకాధికారిణి, ఎంపీడీఓ జయసుధ అన్నారు. మంగళవారం వంగూరు మండల పరిధిలోని ఉల్లంపల్లి గ్రామంలో నిర్మించిన ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లను పరిశీలించారు. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన ఉల్లంపల్లి గ్రామం ఉత్తమ గ్రామ పంచాయతీగా ఏర్పాటు కావడంతో ఆ గ్రామంలో సర్పంచ్ బక్కయ్య చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి మౌళిక వసతుల నిర్వహణపై అవగాహన కల్పించినందుకే ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక కావడమైంద న్నారు. గ్రామ పంచాయతీల్లో 164 ఇండ్లకు వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు నిర్మించేలా ప్రజలకు అవగాహన కల్పించి నిర్మించిన వాటిని వినియోగిస్తున్నారా లేదా అని పర్యవేక్షించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లకు సింకు, తలుపులు లేని వాటిని గుర్తించి వెంటనే ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి వాటి స్థానంలో హరితహారం కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటాలని, రహదారులపై నీళ్ల నిలువకుండా మరమ్మత్తులు చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, ఎపీఎం బాల్‌చందర్, ఎపీఓలు వాసుదేవ్, లక్ష్మయ్య, పీఏ విజయ్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

## బోయలను ఎస్టీ జాబితాలో చేర్చండి..

### - మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతి..

**శ్రీరంగాపురం, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బోయ ఐక్య కార్యచరణ కమిటీ స్టీరింగ్ సభ్యులు గట్టు, కృష్ణ, నరేష్ నాయుడు ఆధ్వర్యంలో గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును మంగళవారం కలిసి వాల్మీకి బోయలను సీఎం కేసీఆర్ అనేక సభల్లో బోయలను ఎస్టీ జాబి తాలో చేరుస్తానని మాట ఇచ్చా రు. దీనిపై చెల్లప్ప కమిషన్ కూడా న్యాయమైన డిమాండ్ అ ని నిర్ణయించడం జరిగింది కానీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు కావున సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి జరగబోయే అసెంబ్లీలో మాప్రస్తావన ఖచ్చితంగా తీసుకురావాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ని కోరారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ మీ డిమాండ్ ను మా ఎమ్మెల్యేలు కూడా ఇంతకు ముందు జరిగిన అసెంబ్లీలో మీ ప్రస్తావన తీసుకువచ్చారు నేను కూడా ఖచ్చితంగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి ఇప్పుడు జరగబోయే అసెంబ్లీలో ఈ విషయా న్ని తీసుకెళ్తానని మాట ఇవ్వడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఐక్యకార్యచరణ కమిటీ సభ్యులు ఎర్రబెల్లి దయాకర్ రావుకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర ఐక్యకార్యచరణ కమిటీ సభ్యులు

## ఓటర్ ఐడీకి ఆధార్ అనుసంధానం చేయండి

### - తహసిల్దార్ అబ్రహం లింకన్

**శ్రీరంగాపురం, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మండల తహసిల్దార్ అబ్రహం లింకన్ ఒక ప్రకటన ద్వారా అందరు ప్రజా ప్రతినిధులకు, సర్పంచులకు, ఎంపీటీసీలకు, కౌన్సిలర్లకు, వార్డు మెంబర్ లకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగష్టు ఒకటి నుంచి వనపర్తి నియోజకవర్గం పరిధిలో 290 పోలింగ్ కేంద్రాలలో ఓటర్ ఐడీకి ఆధార్ అనుసంధానం చేయబడుతుంది కావున తమరు అందరు మీమీ గ్రామాలలో బూత్ లెవల్ అధికారి(బీఎల్ఓ) కి ఆధార్ అనుసంధానంలో 100% స్వచ్చందంగా ఆధార్ సీడింగ్ అయ్యేటట్లు చూడగలరని అందరికి సూచించారు. ఓటర్ల జాబితాలను ఆధాం నెంబర్లతో అనుసంధానం చేసే ప్రక్రియ ఆగస్టు 1 నుంచి దేశ వ్యాప్తంగా ప్రారంభమైంది కావున ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, వివరాల దిద్దుబాటు, అడ్రెస్ మార్పు తదితర నకిలీ ఓట్లను అరికట్టడం, బోగస్ ఓటర్ ఐడీలను ఏరివేస్తూ పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర కసరత్తులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓటర్ జాబితాలను ఆధార్ నెంబర్ లతో అనుసంధానం చేసే ప్రక్రియకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన తెలిపారు.

## జిల్లా అధికారుల సంఘ సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**నారాయణపేట, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** జిల్లా అధికారుల సంఘం ఏర్పాటైన సందర్భం గా డిఆర్‌డిఎ స్కిల్ డెవలప్‌మెంట్ హాల్ నారాయణపేటలో మంగళవారం జిల్లా అధికారుల సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించారు. సంఘం పటిష్టత, జిల్లాలో జరిగే అన్ని అభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనటం, జిల్లా యంత్రాంగానికి అన్ని విధాలుగా ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు శాయ శక్తులా కృషి చేయాలని తీర్మాణించారు. జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు గోపాల్‌నాయక్, కార్యదర్శి కృష్ణమాచారి, ఉపాధ్యక్షులు జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సురేఖ, ట్రెజరర్ సుధాకర్, డిపిఓ మురళి, డిహెచ్‌ఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డిసిఎస్‌ఓ శివప్రసాద్‌రెడ్డి, సిపిఓ గోవిందరాజు, డిఎఫ్ఓ వీణావాణితో పాటు దాదాపు 40 మంది జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా సాంకేతిక వసతి గృహం

### - కోట్ల రూపాయలు మట్టిపాలు

### - నిర్మాణం పూర్తై 3ఏళ్లు గడుస్తున్న ప్రారంభానికి నోచుకోని వసతి గృహం

**పెబ్బేరు, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణానికి సాంకేతిక కళాశాల బాలికల వసతి గృహం 3 సంవత్సరాల క్రితం నిర్మాణం పూర్తి చేసుకొని ఇంత వరకు ప్రారంభం కాకపోవడం బాదాకరం . విద్యార్థినిలు ప్రతి సంవత్సరం కళాశాలలో చదువుకొనుటకు రాష్ట్ర నలుమూలల నుంచి బాలికల వసతి గృహ సదుపాయం కలదని ఇక్కడికి రావడం జరుగుతుంది. తీర ఇక్కడికి వచ్చాక సంబందిత అధికారులు వివిధ కారణాలతో హాస్టల్ వసతి కల్పించకపోవడం పట్ల కొంత మంది తల్లిదండ్రులు విద్యార్థిలను చదువు మధ్యలో మానిపించి వెనక్కి తీసుకెళ్లడం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు "వార్తా" దృష్టికి తీసుకువచ్చారు. మిగతా విద్యార్థుల కష్టనష్టాలు కోరి ప్రైవేట్ హాసట్ల్‌లో ఉండి చదువుకోవడం జరుగుతుందని విద్యార్తులు ఆవేదన చెందుతున్నారు. ఒక్కో విద్యార్థి కి నెలకు ప్రైవేట్ హాస్టల్ ఉండడానికి సుమారు రూ.3నుండి 4వేల వరకు ప్రైవేట్ హాస్టల్ యజమాన్యం వసూలు చేస్తున్నారని విద్యార్థులు వాపోయారు. ఇది విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారిందని ప్రభుత్వ హాస్టల్ ఉండి కూడా ప్రైవేట్ హాస్టల్ లో నెలకు వేలకు వేలు ఫీజులు కట్టడం మా వల్ల కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థినిలు ప్రైవేట్ హాస్టల్ లో ఉండడం వల్ల హాస్టల్ నుండి కళాశాలకు వెళ్లడానికి ప్రైవేట్ ఆటోలను వినియోగించుకోవడం వాటిలో ప్రయాణం చార్జీలు అదనపు భారంగా మారిందని విద్యార్థుల తెలిపారు. కళాశాల నుండి హాస్టల్ కు ఆటోలో వెళ్లి ఆటో దిగిన వెంటనే రోడ్డు దాటడం చాలా ప్రమాదభరితంగా ఉందని విద్యార్థులు భయంభయంగా రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సంవత్సరం అడ్మిషన్స్ పెబ్బేరు పాలిటెక్నిక్ కళాశాలకు సీటు అలాట్ అయిన కూడా హాస్టల్ వసతి లేని కారణంగా కొంత మంది తల్లిదండ్రులు వారి పిల్లలను ఇక్కడ జాయిన్ చేయకుండా తిరిగి వెళ్లిపోవడం జరుగుతుందని తెలిసింది. ప్రైవేట్ హాస్టల్ లో ఉండడం వల్ల మధ్యతరగతి కుటుంబాలకు సాంకేతిక విద్య అనేది ఒక వరంగా భావించి పిల్లలను సాంకేతిక విద్య వైపు ప్రోత్సహిస్తు ఉంటారు కానీ ఇలాంటి దుర్భర పరిస్థితిలో వారిని ఆర్థికంగా హాస్టల్ వసతి లేని కారణంగా చదువు మాన్పించే పరిస్థితి ఏర్పడడం సిగ్గుచేటు. సాంకేతిక కళాశాల ఉన్నత అధికారులు తక్షణమే హాస్టల్ ను ప్రారంభించి విద్యార్థులకు తగిన వసతి కల్పించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుకుటుంన్నారు. ఇట్టి హాస్టల్ విషయమై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చొరవ తీసుకొని తమ పిల్లల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని సాంకేతిక కళాశాల హాస్టల్‌ను ప్రారంభించి విద్యార్థులకు మంచి భవిష్యత్ అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రిని కోరారు.



నిర్మాణం పూర్తై నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్



ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలకు ప్రమాదకరంగా రోడ్డు దాటి వస్తున్న విద్యార్థులు

● కళాశాల హాస్టల్ కేవలం బిల్డింగ్ మాత్రమే ఉన్నది హాస్టల్‌లో మంచినీటి సమస్య ఉంది, ఫర్నిచర్ లేదు ముఖ్యంగా అమ్మాయిల హాస్టల్ కాబట్టి సెక్యూరిటీ పరంగా జాగ్రత్తలు తీసుకునేందుకు పై ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకెళ్లాం బడ్జెట్ లేనందున హాస్టల్ ప్రారంభోత్సవం ఆలస్యం అయితుంది. త్వరలోనే హాస్టల్ ప్రారంభోత్సవం జరుగుతుంది. గత ఏడాది కంటే ఈ ఏడాది అడ్మిషన్స్ కూడా పెరిగాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా హాస్టల్ ప్రారంభోత్సవం కోసం కృషి చేస్తున్నాం.

*- రమేష్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్*

## మొక్కలు నాటిన జడ్పీ ఛైర్‌పర్సన్

**నారాయణపేట, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ వనజ ఆంజనేయులుగౌడ్ మక్తల్ మండలం ఆయిల్ పామ్ (పామ్ ఆయిల్) మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పామ్ ఆయిల్ మొక్కలు పెంచడం వలన ఒక ఎకరాకు నికరంగా 1,50,000 రూపాయలు రైతుకు లాభం వస్తుందని, అందువల్ల రైతును రాజును చేయడానికి మన సీఎం కెసిఆర్ ఎకరానికి రూ. 80 వేలు సబ్సిడి ఇస్తున్నారని, డ్రిప్ కంపెనీలకు సబ్సిడిలు ఇస్తున్నారని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటకు ఎలాంటి చీడ, పీడలేని సాగుఅని, కోతులు ముట్టవని, అడవ పందులు తినవని తెలిపారు. అదేవిధంగా పామాయిల్ గెలలను మన రాష్ట్ర ప్రభుత్వం సంస్థ ఆయిల్‌ఫెడ్ కొంటది అని, ఫ్యాక్టరీ వాళేల మనపంట దగ్గరికి వచ్చి కొంటారని మనము నెలకు ఒకసారి కమ్మకొట్టుడు, గెలకొట్టుడు చేస్తే సరిపోతుందని మన అకౌంట్‌లో ఫ్యాక్టరీ వాళ్లు డబ్బులు వేస్తారని తెలిపారు. ఆయిల్ పాం పంటకు గుంతలు కూడా ఉపాధి హామీలో మన ప్రభుత్వం తవ్విస్తుందని, మూడు, నాలుగు సంవత్సరాల పాటు పత్తిలాంటి అంతర పంటలు కూడా ఆయిల్‌పామ్ తోటలో వేసుకోవచ్చని తెలిపారు. మనం వరిలాంటి పంటలువేస్తే ఎకరాకు ఎక్కువలో ఎక్కువ 20 వేల నుండి 25 వేలు మాత్రమే మన రైతుకు ఆదాయం వస్తుందని, అదే పామాయిల్ పంట వేస్తే తక్కువలో తక్కువ నెలకు రూ. 1,50,000 వస్తాయని ఛైర్‌పర్సన్ తెలిపారు. మనదేశంలో జనం ఎక్కువ, నూనె పంటలు సాగు తక్కువ, అందుకే మన భారతదేశం విదేశాల నుంచి లక్ష కోట్ల రూపాయల పామాయిల్ దిగుమతి చేసుకుందని, దీనిని గమనించే మన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దేశానికి అన్నంపెట్టే రైతన్న గురించి ఎల్లవేళలా ఆలోచిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి దేశంలో ఎవరు ఇవ్వని విధంగా పెద్ద మొత్తంలో రైతుబంధు, రైతుభీమా లాంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థికంగా సహాయం చేస్తున్నారని, అదేవిధంగా రైతులు పామాయిల్ పంటలు వేసుకోవడానికి ప్రోత్సహిస్తూ ఎకరాకు 80 వేల రూపాయలు సబ్సిడిని ఇస్తున్నారని, కావున ప్రజా ప్రతినిధులుగా ఉన్న జిల్లాకు సంబంధించిన జడ్పీటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు మీఈ గ్రామాలలో రైతుల ఆదాయం పెంచడం కోసం ఆయిల్‌పామ్ పంటను సాగు చేయడానికి రైతులను ప్రోత్సహించాలి. దీనిద్వారా రైతుకు సేవచేసే భాగ్యం మనకు లభిస్తుందని, ఇందుకుగాను ఒకరైతు బిడ్డగా పామ్ ఆయిల్ సాగును ప్రోత్సహిస్తున్న మన ముఖ్యమంత్రి కెసిఆర్‌కు నారాయణపేట రైతుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.



పామ్ ఆయిల్ మొక్కలు నాటుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్

## పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపే దాకా కదలం..

### - పట్టాలు ఇచ్చి 25 ఏళ్లు గడిచిన స్థలాలు చూపలేదు..

### - సర్వే నెం.586-87 ప్రభుత్వ భూమిలో సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు



:సీపీఎం బృందంతో చర్చలు జరుపుతున్న తహసిల్దార్ సింధుజ



స్థలం శుభ్రం చేసుకుంటున్న లబ్దిదారులు

**అమరచింత, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** ఇండ్లు లేని పేదలకు పట్టాలిచ్చి 25 ఏండ్లు గడుస్తున్న లబ్దిదారులకు స్థలం చూపడంలేదని అధికారులకు ఎమ్మెల్యే లకు వినతిపత్రాలు ఇచ్చిన సమస్య పరిష్కరించడంలో పాలకులు విఫలమైయ్యారు. మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టాలు పొందిన లబ్దిదారులు సీపీఎం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసుకొని సీపీఎం కార్యాలయం నుండి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ సర్వే నెంబర్ 586-87 ప్రభుత్వ భూమిలో లబ్దిదారులు స్థలాలను శుభ్రం చేసుకుంటుండగా పోలీసులు అడ్డుకున్నారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ మాట్లాడుతూ పేదలకు పట్టాలిచ్చి ఏండ్లు గడుస్తున్న స్థలాలు ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల లబ్దిదారులతో కలిసి గుడిసెలు వేసుకుంటున్నామని లబ్దిదారులు ఎమ్మెల్యే, అధికారులు హామీలకు మోసపోయారని ఆయన అన్నారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటున్న విషయం తెలుసుకున్న తహసిల్దార్ సింధూజ సీపీఎం నాయకుల బృందంతో మూడునెలలో లబ్దిదారులకు న్యాయం చేస్తారని చెప్పిన సీపీఎం నాయకులతో జరిపిన చర్చలు విఫలమవడంతో తహసిల్దార్ సింధూజ వెనుదిరిగివెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తగా ఆత్మకూర్ సీఐ కెఎస్ రత్నం, కొత్తకోట సీఐ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎస్ఐ జయన్న ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి, జీఎస్ గోపి, బి.వెంకటేష్, ఆర్ఎన్ రమేష్, ఎస్.అజయ్, శ్యాంసుందర్, బుచ్చన్న తో పాటు లబ్దిదారులు పాల్గొన్నారు.

## చెరువు తూము గండి వృధాగా పారిన చెరువు నీరు..

### - రైతుల ఫిర్యాదుతో స్పందించిన అధికారులు

**కొత్తకోట, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** కొత్తకోట మండల పరిధిలోని అమడబాకుల గ్రామంలో గల ఊర్వ చెరువు మొదటి తూము గండిపడంతో సాగునీరు రెండు రోజులుగా వృధాగా పారుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళ వారం ఉదయం స్థానిక రైతులు గౌనికాడి చిన్నయ్య, మందడి వెంకటయ్య, నకనమోని నాగన్న, చిన్న రాములు, బోయ కొల్లంపల్లి, అబ్దుల్లా, కర్రె బాలస్వామి కలిసి అధికారులకు సమాచారం అందిచడంతో తహసిల్దార్ బాల్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరిగేషన్ అధికారులకు పిలిపించి వృధాగా పొలాలకు పారుతున్న సాగునీరు ను మట్టితో నింపి గండిని పూడ్చి వేశారు. ఊర్వ చెరువు నీరు సోమవారం నుంచి వరినార్లు మీదుగా భారీగా నీళ్ల పారుతుండంతో వనపర్తి జిల్లా జడ్పీచైర్మెన్ వామన్ గౌడ్, ఇరిగేషన్ డిఇ గఫార్, ఏఈ అచల్, సర్పంచ్ బుచ్చన్న, ఎంపీటీసీ శేశిరెడ్డి, టీఆర్ఎస్ గ్రామ నాయకులు సురేందర్ చారి ఆధ్వర్యంలో తూము దగ్గర పడిన గండిని మట్టితో పూడ్చివే యడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా జాతీ య రహదారి పక్కగల అలుగు దగ్గర చెత్త చెదారంతో కంపచెట్ల ను తొలగించి అలుగు నీళ్ల కిందకి పారే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



అమడబాకుల గ్రామ ఊర్వ చెరువు దగ్గర గండిపడ్డ దృశ్యం

## జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న జెడ్పిచైర్మన్ దంపతులు

**ఇటిక్యాల సెప్టెంబర్6 ప్రభాతవార్త :** అలంపూర్ పట్టణంలో వెలసిన శ్రీ జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని మంగళవారం గద్వాల జిల్లా జెడ్పిచైర్మన్ సరితా తిరుపతయ్య దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పి చైర్మన్ సరిత జన్మదినం సందర్భంగా జోగులాంబ అమ్మవారిని దర్శించుకోని సందర్భంగా జోగులాంబ అమ్మవారిని దర్శించుకోని వారికి ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికి పలికి ఆలయ ప్రధాన అర్చకులుచే పూజలు చేయించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మాజీ సర్పంచు జయరాముడు స్థానికులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



జోగులాంబ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

## ఎమ్మెల్యే ఆల ఔదార్యం..

### - స్వయంగా ఇంటికి వెళ్లి ఆసరా పెన్షన్ పత్రం అందజేసిన ఎమ్మెల్యే

**భూత్పూర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంక టేశ్వర్‌రెడ్డి మరోసారి తన ఔదార్యం చాటా రు. పక్షవాతంతో సత మతమవుతున్న ఆసరా పెన్షన్ లబ్ధిదారుని ఇంటికి స్వయంగా వెళ్లి తెలంగాణ ప్రభుత్వం వృద్ధులకు అందిస్తున్న ఆసరా పెన్షన్ పత్రాన్ని అందించడంతో పాటు కొంత నగదు ఆర్థిక సహాయం అందించారు. భూత్పూర్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి వెంకటయ్య గత కొంత కాలంగా పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడు. సదరు వెంకటయ్య ఆసరా పెన్షన్ పథకానికి ధరఖాస్తు చేసుకోగా అతనికి ఆసరా పెన్షన్ మంజూరు అయింది. వెంకటయ్యకు నడువలేని పరిస్థితిని గమనించి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం పెన్షన్ మంజూరు పత్రం తీసుకుని హుటాహుటిన ఇప్పలపల్లి గ్రామానికి వెళ్లి బాధితుని పరామర్శించి పెన్షన్ పత్రం కార్డు అందజేసి, తన జేబులోంచి కొంత డబ్బును తీసి ఆర్థిక సహాయంగా బాధితుడు, ఆసరా పెన్షన్ లబ్ధిదారుడైన వెంకటయ్యకు అందజేశారు. ఎమ్మెల్యే మానవత్వం, ఉదారత్వం పట్ల ఎమ్మెల్యేను పలువురు అభినందించారు.



ఆసరా పెన్షన్ మంజూరి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

## వేలం లడ్డును దక్కించుకున్న టీఆర్ఎస్ నేత తోక

**భూత్పూర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణంలోని తొమ్మి దోవార్డులో స్థానికులు ప్రతిష్టించిన వినాయక విగ్రహాన్ని టీఆర్ఎస్ సీనియర్ నేత తోక మురళీధర్‌గౌడ్ సంద ర్శించి వినాయకుని లడ్డు వేలంలో పాల్గొని రూ.11వేల516లకు దక్కించుకున్నారు. అం తక్రితం ఐదోవార్డు లో గణేష్ ఉత్సవ కమిటీ. అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటు చేసిన అన్నదాన కార్య క్రమంలో పాల్గొన్నా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకులు దళితరత్న బోరింగ్ నర్సింహులు, మేకల సత్యనారాయణ, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్, గడ్డం డీలర్ నర్సింహ్మా, సత్తూరు అశోక్‌గౌడ్, మండి ఆటో వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



లడ్డును వేలం పాటలో స్వీకరిస్తున్న తోక



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, తోక తదితరులు

## కార్యకర్త అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**మూసపేట, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** మండలంలోని జానంపేట గ్రామంలో మంగళవా రం కాంగ్రెస్ కార్యకర్త అబ్దుల్ రజాక్ అనారో గ్యంతో మరణించడం జరిగింది. నియోజక వర్గ కాంగ్రెస్ టిపిసిసి కార్యదర్శి జి. మధు సూదన్‌రెడ్డి విషయం తెలిసిన వెంటనే వారి అంత్యక్రియలకు గాను ఆర్థిక సహాయంగా రూ. 5 వేలు కాంగ్రెస్ నాయకులు రజాక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షులు బోడి వెంకటేష్, సీనియర్ నాయకులు ఆంజనేయులు, గ్రామ కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు బోయరవి, శివ, జహంగీర్ పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందస్తున్న దృశ్యం

## సమస్యల పరిష్కారానికి కృషి..



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న టీఆర్ఎస్ పార్టీ నాయకులు

**వంగూరు, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** గురుకులాల్లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని టీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ గురుకులాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలానికి సంబంధించిన గురుకు లంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు విద్యార్థులతో కలిసి భోజనాన్ని చేశారు. అంతకు ముందు గురుకులంలో ఏర్పడిన సమస్యలను తెలుసుకొని పరిష్కరిం చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్‌సభ్యులు హామీద్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు లాలుయాదవ్, కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు అంకు సురేందర్, నాయకులు ఎల్లగౌడ్ తదితరులు ఉన్నారు.

# సాతర్ల, చాగాపురం రహదారులకు బ్రిడ్జిలు నిర్మించాలి

## - భారీ వర్షాలతో దాటలేక అవస్థలు పడుతున్న గ్రామాల ప్రజలు

**ఇటిక్యాల, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సాతర్ల గ్రామం సమీపంలో రహదారిపై కాజ్‌వే బ్రిడ్జి లోతుగా గుంత ఏర్పడడంతో భారీ వర్షాల కారణంగా నిండుకుండలా వరదనీరు ప్రవహిస్తుండడంతో ఆ గ్రామ ప్రజలు రోడ్డు దాటేందుకు కొన్నేళ్లుగా అవస్థలు పడుతున్నారు. అలాగే ఇటిక్యాల రైల్వే స్టేషన్ నుండి చాగాపురం వెళ్లే రహదారిపై కూడా ఇలాంటి అవస్థలు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఎగువన భారీ వర్షం కురవడంతో పంటపొలాలలోని వరద నీరు వాగులో పారుతుండడంతో రోడ్డు దాటేందుకు రైతులు, ప్రజలు అటువైపు, ఇటువైపు గంటల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతుంది. ఈ కాజ్‌వే స్థానాలలో ఎత్తుగా బ్రిడ్జిలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అంతేకాక మండల పరిధిలోని ఆర్.గార్లపాడు గ్రామ సమీపంలో కూడా ఇలాంటి కాజ్‌వే ఉండగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రెండు కోట్ల రూపాయల నిధుల మంజూరు కాగా రెండేళ్లుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో పై నుండి కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ఉధృతి కొనసాగుతుండడంతో ఇక్కడ కూడా ఇలాంటి పరిస్థితి ఆర్ గార్లపాడు గ్రామ ప్రజలు రెండేళ్లుగా ఎదుర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పని చేసిన జూపల్లి కృష్ణారావుకు సాతర్ల, చాగాపురం గ్రామాల రహదారులపై కాజ్‌వే స్థానాలలో కొత్తగా బ్రిడ్జిలు నిర్మించాలని స్థానిక సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావుకు మొరపెట్టుకున్నారు. కానీ ఇప్పటివరకు నిధులు మంజూరు కాకపోవడంతో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం



సాతర్ల గ్రామ సమీపంలో కురిసిన భారీ వర్షానికి నిండుకుండలా ప్రవహిస్తున్న కాజ్‌వే. వరద నీటిలోనే రోడ్డు దాటుతున్న రైతులు

సాతర్ల గ్రామ సమీపంలో కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకుపోయారు. స్థానిక ఎమ్మెల్యే అబ్రహాం ప్రత్యేక చర్యలు తీసుకుని పై రెండు గ్రామాల రహదారుల వెంట ఉన్న కాజ్‌వే స్థానాలలో కొత్త బ్రిడ్జిలు త్వరగా నిర్మాణం చేపట్టి వర్షాకాలంలో ప్రయాణానికి ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## పద్మశాలీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**అచ్చంపేట అర్బన్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పద్మశాలి సమాజ అభివృద్ధి, రాజకీయ ప్రోత్సాహం సంబంధించిన పలు అంశాలపై మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో నాగర్‌కర్నూల్ జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు కోటకిశోర్ ఆధ్వ ర్యంలో తెలంగాణ



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసిన పద్మశాలి సంఘం నేతలు

పద్మశాలి సంఘ ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాసులు, ఆల్ ఇండియా యువజన సంఘం అధ్యక్షులు ఏలె వెంకటనారాయణ, పులిజాల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు బాలే ప్రవీణ్, బింగి నవీన్, ముత్యాల భాస్కర్, మునగపాటి నవీన్, కర్నాటి సుధాకర్ తదితరులు చర్చించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ ఐదు జిల్లాలుగా విడిపోయిన తర్వాత పద్మశాలి సమాజం తీవ్ర నాయకత్వ లేమితో సతమతమవుతున్నది. పలు గ్రూపులు, కోర్టు కేసులతో సంఘాన్ని ఇబ్బంది పెట్టే విధంగా ప్రయత్నం చేస్తున్నారని, సంఘానికి సంబంధించిన ఆస్తులు తమకు సంబంధించిన ఆస్తులుగా చిత్రీకరించబడుతున్నాయని, ప్రభుత్వ పరంగా తగు నిర్ణయాలు తీసుకుని వెనుకబడిన కులాలలో ఒకటైన పద్మశాలి సమాజానికి మార్గదర్శకం చేయాలని విన్నవించారు. ఇలాగే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు పద్మశాలీలకు వర్తింపజేయాలని కోరారు. అలాగే నామినేటెడ్ పోస్టుల్లో పద్మశాలీలకు అవకాశం ఇవ్వాలని కోరారు.

## జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**తెల్కపల్లి, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గౌరెడ్డిపల్లిలో పని చేస్తున్న నర్సింహారెడ్డి, తేజ్య, రవిందర్, బాలయ్యలు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సందర్భంగా మంగళ వారం పాఠశాలలు శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఎంతో గౌరవ ప్రదమైనదని, ఉపాధ్యాయులు విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎల్లప్పుడు కృషి చేయాలని కోరారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరిని విద్యార్థుల సమక్షంలో శాలువాలతో సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రుడు, ఉపాధ్యాయులు మల్లికార్జున్, శివప్రసాద్, నరసింహులు, వెంకటేష్, రామకృష్ణ, రమాదేవి, మధుసూదన్‌రెడ్డి, రంజిత్, కృష్ణయ్య, రేణుక విద్యార్థులు పాల్గొన్నారు.

## పేట డిసిసి అధ్యక్షుడిగా వాకిటి శ్రీహరి ముదిరాజ్

**మక్తల్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీకి నూతనంగా నియమించబడిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ వాకిటి శ్రీహరి డిసిసి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. మంగళవారం పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా



నియామక పత్రం అందుకుంటున్న వాకిటి శ్రీహరి

నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చిల్లెల చిన్నారెడ్డి, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనరెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, మహబూబ్‌నగర్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, వనపర్తి జిల్లా డిసిసి అధ్యక్షులు శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సప్తాహ, అఖండ భజన కార్యక్రమం..

**శ్రీరంగాపురం, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సప్తాహం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరి గింది. శ్రావణమాసంలో ప్రతి ఏటా నిర్వహించే సప్తహ ఉత్సవాలలో భాగంగా మంగళవారం కీర్తన, హరినామ పారాయణం, భజనలు, ప్రవచనాలు చేశారు. ఆంజనేయ



సప్తాహ ఉత్సవాలలో పాల్గొన్న భజన బృందం

స్వామి ఆలయంలో ఏడాదిలో పలు ముఖ్యమైన దినాల్లో ఉత్సవాలు, పూజలు, పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. స్వామి వారి ఆలయంలో అఖండ భజన కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆలయ ఆవరణం హరినామం, ఆంజనేయ స్వామి నామస్మరణతో మారుమోగిపోయింది.

## తెగిపోయిన తాత్కాలిక రోడ్డు రాకపోకలు బంద్..

**గోపాల్‌పేట, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త :** గోపాల్‌పేట సమీపంలో గల వాగుపై దాదాపు రూ.2కోట్ల లతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. అయితే బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి అయ్యే వరకు పక్కపొలాల్లో తాత్కాలిక మట్టిరోడ్డును ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి చెరువులు కుంటు నిండిపోయి



కోతకు గురైన తాత్కాలిక మట్టి రోడ్డు

పెద్ద చెరువు, కట్ల చెరువులు అలుగులు పారడంతో బ్రిడ్జి దగ్గర ఉన్న తాత్కాలిక మట్టి రోడ్డు నీటి ఉధృతికి కోతకు గురై వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. గోపాల్‌పేట నుండి హైదరాబాద్, నాగర్‌కర్నూల్ వెళ్లే ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. మంగళవారం ఉదయం నుండి హైదరాబాద్, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ వనపర్తి నుండి బుద్దారం మీదుగా తరలించారు. ఈ విషయంపై సంబంధిత కాంట్రాక్టర్ పిలిచి జేసీబీల సహాయంతో మట్టి రోడ్డును పునరుద్దరణ చేశారు. దాదాపు సాయంత్రం 4 గంటలకు తాత్కాలిక రోడ్డు పూర్తైంది. కానీ బస్సుల మాత్రం రాకపోకలు జరగలేదు. సంఘటన స్థలానికి సర్పంచ్ శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు మతిన్ దగ్గరుండి పనులను పరిశీలించారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం..

**జల్లాఘనపురం, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను గ్రామ పెద్ద సత్యం గౌడ్ మంగళవారం పూలమాలలు, శాలువా మొమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

కీర్తిశేషులు లక్ష్మణ్ గౌడ్, జ్ఞాపకార్థం పాఠశాలలోని విద్యార్థులకు దాత సత్యం గౌడ్ టై, బెల్టులను బహుకరించారు.. విద్యార్థులకు క్రమశిక్షణతో కలిగిన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తగినంత మంది ఉపాధ్యాయులు లేనందున ప్రత్యేక ఉపాధ్యాయులను ఏర్పాటు చేసుకోవడంతో వారి ఖర్చుల నిమిత్తం రూ.516 అందజేశారు. విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తూ పాఠశాలకు సహకరిస్తున్న సత్యం గౌడ్ ను ఉపాధ్యాయులు అభినందిస్తూ సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలను దాతలు ఆదుకోవాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల హర్షధ్వనాల మధ్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి గౌడ్, సురేష్ కుమార్, కమల, ప్రమోద్, మధు, నవీన్, అనిల్, శివ, అఫ్రీన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలకు కూడా కటాఫ్ మార్కులు తగ్గించాలి

## -తెలంగాణ దళిత దండు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బచ్చలకూర బాలరాజు

**కొల్లాపూర్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2022 సంవత్సరానికి పోలీస్ శాఖలో సివిల్ తదితర విభాగాలలో ఖాళీల భర్తీకి పోలీస్ నియామక బోర్డు 16929 వేల కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు ఆగస్టు 28న నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌లు పాటించలేదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ విధానాన్ని కొనసాగించి తగు చర్య తీసుకోవాలని గతంలో మాదిరిగానే రిజర్వేషన్ అమలు జరపాలని తెలంగాణ దళిత దండు రాష్ట్ర అధ్యక్షులు బచ్చలకూర బాలరాజు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో రిజర్వేషన్లను అమలు జరపకపోవడం పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని, గతంలో నిర్వహించిన పోలీస్ సెలక్షన్ మార్కు్బ కటాఫ్ రిజర్వేషన్లు ఓసిలకు 80 మార్కులు, బిసిలకు 70 మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 60 మార్కులను కటాఫ్ మార్కులుగా నిర్ణయించారన్నారు. కాని ఆగస్టు 28న నిర్వహించిన పోలీస్ రిక్రూట్‌మెంట్ ప్రిలిమ్స్ పరీక్షలో ఓసి అభ్యర్థులకు 80 మార్కుల నుండి 60 కి తగ్గించడం, బిసి అభ్యర్థులకు 70 నుండి 60కి తగ్గించడం ఎస్సీ, ఎస్టీలకు 60 నుంచి తగ్గించకపోవడం, మిగతా సామాజిక వర్గాల లాగానే ఎస్సీ, ఎస్టీలకు సమానంగా ఉంచడం ఇది ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం చేయడమే అవుతుందన్నారు. ఎందుకంటే ఓసి కన్నా విద్యా రంగంలో పూర్తిగా అణిచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలలో రిజర్వేషన్ కటాఫ్ మార్కులను ఓసి, బిసిల లాగానే ఎస్సీ, ఎసత్టలకు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. దానిని రిజర్వేషన్ అంటారని, ఓసిలకు 20 మార్కులను బిసిలకు 10 మార్కులను తగ్గించి ఎస్సీ, ఎస్టీలకు తగ్గించకపోవడం వారితో సమానంగా ఉంచడం ప్రిలిమ్స్ ఎగ్జామ్ ద్వారానే ఎస్సీ, ఎస్టీలను ఇంటికి పంపించే కుట్ర అన్నారు. ఎందుకంటే ప్రిలిమ్స్ ఎగ్జామ్ పాస్ అయిన తర్వాత గ్రౌండ్ టెస్టు తర్వాత మెయిన్స్ రెండు కూడా పాస్ కావాలి. కాని ప్రభుత్వం ముందుగానే కుట్ర చేస్తుందన్నారు. అయితే మెజార్టీ అభ్యర్థులను ప్రాథమిక రాత పరీక్ష ద్వారానే వెనుక పంపడం మనువాదుల పాలకవర్గం చేస్తున్న ప్రధాన కుట్రగా కనబడుతున్నందున వెంటనే ఎస్సీ, ఎస్టీలకు 60 నుండి కటాఫ్ మార్కులు తగ్గించాలని ఓసిలకు 20 మార్చి తగ్గించిన విధంగానే బిసిలకు కూడా 20 మార్కులు తగ్గించి రిజర్వేషన్ అమలు పరచాలన్నారు. గిరిజన తెగల ప్రజలు 36 లక్షల మంది, ఎస్సీలు 60 లక్షల మంది ఉండగా 2014 నుంచి గిరిజనుల జనాభా దామాషా ప్రకారం అమలు జరపాల్సిన రిజర్వేషన్లను అమలు జరుపక నేడు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ రిజర్వేషన్లలో పరీక్ష మార్కులను అగ్రవర్ణ అగ్రకులాలతో సమానంగా 60 మార్కులను సూచించడం అంటే రిజర్వేషన్ అమలు జరపకపోవడం ఇది ముమ్మాటికి కుట్రగానే ఉన్నదని దీన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రం అనేక తప్పుల తడకగా ఉన్నదన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కటాఫ్ మార్కులు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధుల చెక్కుల పంపిణీ

## - వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కృషితో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ అంజేశారు. 30వ వార్డు ఐజయ్య కాలనీకి చెందిన వంశీ గౌడ్ రూ.13వేలు, సాయినగర్ కాలనీకి చెందిన జయమ్మ కు రూ.19వేలు అదే కాలనీకి చెందిన మహాదేవుడు రూ.40 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ పేదరికంతో మగ్గుతున్న కనీసం వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నటువంటి పరిస్థితుల్లో చుట్టు పక్కల వారు స్థానిక కౌన్సిలర్ వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా ముందు మీరు ఆసుపత్రికి తీసుకెళ్లండి నేను మంత్రి తో మాట్లాడి సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పిస్తానని హామి ఇచ్చిన వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పేదరికంలో ఉన్నటువంటి అనారోగ్యంతో బాధపడుతున్న వనపర్తి పట్టణ 30వ వార్డుకు చెందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి చెక్కులు మంజూరు చేయించడం జరిగిందని వాకిటి శ్రీధర్ తెలిపారు. అనంతరం వైస్ చైర్మెన్ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మ, జంగిడి రాజు, అరుణ్ యాదవ్, చింతల సత్యం తదితరులు పాల్గొన్నారు.



బాధితుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్

# గల్లంతైన వ్యక్తి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు..

**ఖిల్లాఘనపురం, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన భర్త వెంకటయ్య(49) శివారు ప్రాంతంలోని చెక్ డ్యాం దగ్గర వాగులో మునిగి సోమవారం ఉదయం గల్లంతయ్యారు వాగులో పడి 24 గంటలు గడిచిన మృతదేహం తేలకపోవడంతో పోలీసు సిబ్బంది గత రెండు రోజులుగా మృతదేహం లభ్యం కోసం చేర్యలు ఫలించలేదు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ తెలియకపోవడంతో వలలు ఏర్పాటు చేసి మృతదేహాన్ని కనుగొనడానికి పలు రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఫైర్ సిబ్బంది పోలీస్ సిబ్బంది, మత్స్యకారులు మృతదేహాన్ని వెతకడానికి వాగులో దిగి గాలింపు చర్యలు చేపట్టిన ప్రయోజనం లేకుండా పోతుంది. గల్లంతైన వ్యక్తి ప్యాంటు, అతడు ధరించిన టోపీ ఆనవాళ్లు మాత్రం దొరికాయి. పోలీసు సిబ్బంది వాగు వెంబడి తిరుగుతూ మృతదేహాన్ని కనుగొనడానికి అష్టకష్టాలు పడుతున్నారు. వాగు ప్రవాహం ఉండడంతో మృతదేహం ఎక్కడ లభిస్తుందో అనే సంశయం పలువురు వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.



గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు జరుపుతున్న మత్స్యకారులు, పోలీసులు

# పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలి వినతి

**లింగాల, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నిర్వహించిన ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కొరకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పరీక్షలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రాజ్యాంగ బద్ధంగా రావలసిన రిజర్వేషన్లు అమలు చేసి న్యాయం చేయాలని లంబాడి ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016, 2018లో వచ్చిన ఎస్సై, కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో ఓసి 80 శాతం, బిసి 70 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం క్వాలిఫైయింగ్ మార్కులు పెట్టి ఎటువంటి నెగిటివ్ మార్కులు లేకుండా ఉండేవని అన్నారు. కాని ఇప్పుడు వచ్చిన నోటిఫికేషన్‌లో నెగెటివ్ మార్కులు పెట్టి ఓసి, బిసి, ఎస్సీ, ఎస్టీ అని తేడా లేకుండా అందరికి 60 శాతం మార్కులు క్వాలిఫైయింగ్‌గా నిర్ణయించడం అన్యాయమని అన్నారు. ఓసిలకు 20 శాతం మార్కులు, బిసిలకు 10 శాతం మార్కులు తగ్గించినప్పుడు ఎస్సీ, ఎస్టీలకు ఎందుకు తగ్గించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిలిమ్స్‌లో ఓసి, బిసి, ఎస్సీ, ఎస్టీలకు ఒకే అర్హత మార్కులు నిర్ణయించడం బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లు తుంగలో తొక్కే ప్రయత్నమేనని దీన్ని లంబాడి ఐక్యవేదిక తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. నెగిటివ్ మార్కుల వల్ల ఐదారు సంవత్సరాల నుండి కష్టపడుతున్న ఎస్సీ, ఎస్టీల అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, ఓసిల అభ్యర్థులకు సమాన క్వాలిఫైయింగ్ మార్కుల వల్ల ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల సంఖ్య తగ్గి పోస్టుల భర్తీలో తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల గతంలో పాటించిన పద్ధతిని అనుసరిస్తే అన్ని వర్గాలకు న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. రాజ్యాంగ విలువను కాపాడే విధంగా ప్రత్యేక చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డిప్యూటి తహసిల్దార్ ముబీనాబేగంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రూపేష్‌నాయక్, భోజ్యానాయక్, కిషన్ నాయక్, మధునాయక్, శివనాయక్, హనుమంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## సమాజ హితం కోరే వారు జర్నలిస్టులు

### - లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు లయన్ కలిమిచెర్ల రమేష్



జర్నలిస్టులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు లయన్ కలిమిచెర్ల రమేష్

**కల్వకుర్తి, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** సమాజంలోని రుగ్మతలను ఎత్తి చూపుతూ సమాజ హితం కోసం పాటు పడేవారు జర్నలిస్టులని లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు లయన్ కలిమిచెర్ల రమేష్ అన్నారు. ప్రపంచ జర్నలిస్ట్ డే సందర్భంగా మంగళవారం కల్వకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తి కత్తి మీద సాములాంటిదన్నారు. 24 గంటల పాటు వృత్తి పరంగా అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం పనిచేస్తున్న జర్నలిస్టులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి దుగ్గి వెంకటేష్, పీఆర్ఓ చిగుళ్లపల్లి శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు వీరేష్, గుబ్బ కృష్ణ, అప్పాయిపల్లి శ్రీనివాస్, తర్నికల్ శ్రీనివాసు, జర్నలిస్టులు తదితరులు ఉన్నారు.

## పాన్‌గల్ పిహెచ్‌సీలో కేసీఆర్ కిట్టు పంపిణీ..

**పాన్‌గల్, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కదిరెపాడు గ్రామానికి చెందిన జయమ్మ అనే బాలింతకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న కేసీఆర్ కిట్‌ను మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్స్ సౌశీల్య అందజేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సు సౌశీల్య పిహెచ్‌సీ లో ఒకేరోజు



బాలింతకు కేసీఆర్ కిట్టు అందజేస్తున్న దృశ్యం

రెండు కాన్పులు చేశామని మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన జ్యోతి ప్రసవం నొప్పులతో ఆసుపత్రికి రాగా సాధారణ కాన్పు జరిపినట్లు ఆమె తెలిపారు. ఇద్దరు బాలింతలతో పాటు పుట్టిన బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. సెప్టెంబర్ నెలలో ఇప్పటికే రెండు కాన్పులు చేశామని స్టాఫ్ నర్స్ సౌశీల్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యంపై దృష్టి పెట్టండి..

**పాన్‌గల్, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** గ్రామాలలో ప్రజల ఆరోగ్యం పై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వైద్యాధికారి డా.రాజశేఖర్ ఆదేశిం చారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మా ట్లాడారు,



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్

ప్రస్తుత వర్షాకాలని దృష్టిలో పెట్టుకొని ప్రజలు డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలను సూచించాలని కోరారు. గ్రామా లలో విషజ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీ క్షలు చేపట్టి మందులు ఇవ్వాలని కోరారు. గర్భిణీల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులో నమోదు చేయాలని ప్రతి నెల గర్భిణీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకునే విధంగా ఆశాకార్యకర్తలు కృషి చేయాలన్నా రు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు జరిపించుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.ప్రణీత, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్ సంతోషమ్మ, ఏఎన్ఎం లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మన ఊరు మన బడి పనుల పరిశీలన..

**పాన్‌గల్, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు మండలంలోని శాఖాపూర్, మహ్మదాపూర్ తదితర గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పంచాయితీ రాజ్ ఏఈ సత్తయ్య పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఏఈ సత్తయ్య

శాలలో డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, ఇతర పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ బడుల బలోపేతం కోసం తెలంగాణ ప్రభుత్వం మన ఊరు మన బడి ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. జిల్లా సూచన మేరకు సకాలంలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న కాన్సెంట్ అవార్డును పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి భూసేకరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కోయిల్‌సాగర్ తదితర ప్రాజెక్టుల కింద చేపట్టిన భూసేకరణ పనులపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కరివెన రిజర్వాయర్ కింద పెండింగ్‌లో ఉన్న కాన్సెంట్ అవార్డును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. పునరావాస కేంద్రంలో విద్యుత్ పనులకు సంబంధించిన బిల్లుల గుర్తింపు, ఎంజాయ్‌మెంట్ సర్వే త్వరగా పూర్తి చేయాలని, అధికారులు, రైతులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, ఆర్డీఓ అనిల్ కుమార్, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జిల్లా చీఫ్ ఇంజనీర్ రమణారెడ్డి, పిఆర్ఎల్ఐ ఇంజనీర్లు ఉదయశంకర్, రమేష్, జాతీయ రహదారుల సంస్థ డిఈ రమేష్, ఇతర అధికారులు, ఆయా మండల తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

## కౌన్సిలర్ కుమార్తె ను పరామర్శించిన కౌన్సులర్ల సంఘం ఫ్లోర్ లీడర్

**కొత్తకోట,సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** కొత్తకోట మున్సిపాలిటీ కౌన్సిలర్ ఎరుకలి తిరుపతయ్య కుమార్తె వర్షిణి ని తెరాస మున్సిపల్ కౌన్సిలర్ల ఫ్లోర్ లీడర్ రామ్మోహన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. మున్సిపాలిటీలోని 10వ వార్డుకు చెందిన కౌన్సిలర్ ఎరుకలి తిరుపతయ్య కుమార్తె గత రెండు రోజులుగా అనారోగ్యానికి గురై రాహుల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ రామ్మోహన్ రెడ్డి తో పాటు ఖాజామైనుద్దీన్, సీనియర్ జర్నలిస్టు నాకొండ యాదవ్, పాలెం తెరాస నాయకులు జనిగె అంజన్న యాదవ్ లు పరామర్శించి మనోధైర్యం నింపారు.



కౌన్సిలర్ కుమార్తెను పరామర్శిస్తున్న దృశ్యం

## ఉచిత చేపి పిల్లల పంపిణీకి సర్వం సిద్ధం

### - జిల్లా మత్స్యశాఖ అధికారి బి. లక్ష్మప్ప



**నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** ఉచిత చేప పిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి గురించి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జిల్లాలని 200ల మత్స్య కారుల సహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి బి. లక్ష్మప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా యోగ్యమైన 1230 నీటి వనరులు అనగా గుర్తింపు పొందిన చెరువులు, కుంటలు, రిజర్వాయర్లకు 100 శాతం రాయితీపై చేప పిల్లలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లేని గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఈనెల 9తేదీ లోపు సంఘం తీర్మాణాలు, పంచాయతీ ఈకార్యదర్శుల గ్రామ తీర్మాణాలు, నీటి వనరుల పేర్లతో సహా తీర్మాణం జతచేసి నాగర్కర్నూల్ జిల్లా మత్స్య శాఖ వారి కార్యాలయానికి పింపిస్తే అర్హత గల సంఘాలకు చేపపిల్లల పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. సమగ్ర వివరాలను వాట్సాప్ ద్వారా తీర్మాణాలను పంపేందుకు మత్స్య శాఖ కార్యాలయ క్షేత్రస్థాయి సిబ్బందిని సంప్రదించాలని కోరారు. సంప్రదించాలని నంబర్లు డి. రాజ్‌కుమార్ 9490304158, శ్రీకాంత్ 816026003 వాట్సాప్ నంబర్లకు తీర్మాణాలను పంపవచ్చని తెలిపారు.

## ఎస్సైకానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ కటాఫ మార్కులు యధావిధంగా ఉంచాలి - కేవీపీఎస్

**మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో కటాఫ్ మార్కులు యధావిధంగా ఉంచాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం ఇచ్చారు. ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకంలో రిజర్వేషన్ల అమలులో రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతుందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కురుమయ్య, రాష్ట్ర కమిటి సభ్యులు మాణిక్యంరాజు అన్నారు.ప్రభుత్వ విధానాల వల్ల సుమారు 6లక్షల మంది అభ్యర్థులలో ఈవెంట్స్‌కు మెయిన్స్‌కు దాదాపు 4లక్షల మంది అర్హత కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు.ఓసీలకు 80 నుండి 60శాతం, బీసీలకు 70 నుండి 60శాతం మార్కులకు తగ్గించి ఎస్సీలకు మాత్రం 60శాతం మార్కులుగానే ఉంచారని తెలిపారు.ప్రభుత్వం వెంటనే పున పరిశీలన చేసి కటాఫ్ మార్కులు యదావిధంగా ఉంచాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కేవీపీఎస్ నాయకులు సత్యం, ఆదివిష్ణువర్ధన్,భాను ప్రసాద్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు

## మాజీ సర్పంచ్ సంగెం బుచ్చారెడ్డి సేవలు మరువలేనివి

### - డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి

**రాజాపూర్, ఆగస్టు, 06 , ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సంగెం బుచ్చారెడ్డి సేవలు మరువలేనివని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుచ్చారెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ముదిరెడ్డిపల్లి గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బుచ్చారెడ్డి కుమారుడు మాజీ శ్రీనివాస్‌రెడ్డి వృద్ధులకు, నిరుపేదలకు ఏర్పాటు చేసిన చీరలను ప్రభాకర్‌రెడ్డి తదితరులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాద్మి శివకుమార్, టీఆర్ఎస్ మండల అధ్యక్షులు మేకల శ్రీశైలం యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కప్పెరి బచ్చిరెడ్డి, గ్రామ సర్పంచ్ పెంటయ్య, ఎంపీటీసీ సభ్యులు శేఖర్‌గౌడ్, ఉప సర్పంచ్ వెంకటయ్యగౌడ్, వనపర్తి సత్తయ్య, జంగయ్య యాదవ్, నారాయణ గౌడ్, హన్మంత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బ్రహ్మయ్య, రాములు, సత్తయ్య, నారాయణ, ఆశన్నగౌడ్, గోపాల్‌రెడ్డి, జగన్‌కుమార్, లక్ష్మారెడ్డి, నందిగామ శ్రీను, కె. శ్రీనివాసులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఒడిఎఫ్ సర్వే..

**శ్రీరంగాపురం,సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఒడిఎఫ్ (ఓపెన్ డెడికేషన్ ఫ్రీ)బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంపై ఇంటింటికి మరుగుదొడ్డి ఉందా?లేదా..? వాడుతున్నారా.? లేదా..? అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు మరుగుదొడ్డి సౌకర్యం ఉందా.? వాడుతున్నారా? అనే అంశాలపై మంగళవారం సర్వే నిర్వహించడం జరిగింది. స్పెషల్ ఆఫీసర్ క్రాంతి మాట్లాడుతూ పారివుద్య సాధనలో ప్రజలను మమేకం చేయడంతో గ్రామీణ ప్రాంతాలు ఎంతో పరివర్తన చెందాయన్నారు. గ్రామీణ భారతాన్ని బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దే కృషి కి సంబందించి గతంతో నోల్చితే ఇప్పుడు ఎన్నో మైలురాళ్లు అధిగమించినట్టు చెప్పారు. బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాల సాధనలో సుస్థిరత, ఘన, ద్రవ వ్యర్థాల నిర్మూలన నిర్వహణ గ్రామాల్లో సమగ్ర స్థాయి పరిశుభ్రత తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సర్వేలో స్పెషల్ ఆఫీసర్ క్రాంతి, అమరచింత మండల ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహయ్య, ఏపీఎం వెంకటస్వామి, శ్రీరంగాపురం పంచాయితీ కార్యదర్శి సహదేవుడు, అంగన్వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఒడీఎఫ్ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

## చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం

**మదనాపురం,సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మదనాపురం మండలంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చైల్డ్ లైన్ వారి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా చైల్డ్‌లైన్ మండల కోఆర్డినేటర్ ప్రశాంతి మాట్లాడుతూ భ్రూణ హత్యల నివారణ, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అక్రమ దత్తత, లైంగిక దాడులు మొదలగు వాటిపై అవగాహన కలిగాంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు 18 సంవత్సరాల లోపు బాలబాలికలకు సమస్యలు ఎదురైతే 1098 నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఉమ, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ రవీంద్ర, హెల్త్ సూపర్వైజర్ ప్రమీల, చైల్డ్ లైన్ టీం సభ్యులు రాజు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న చైల్డ్‌లైన్ మండల కోఆర్డినేటర్ ప్రశాంతి

## పోషణమాస గోడపత్రికను ఆవిష్కరించిన జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** గర్భిణీలకు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం పోషణమాసం నిర్వహిస్తున్నందున జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్‌బాడీ ఆశీశ్ సంగ్వాన్ తో కలిసి ఆయన పోషణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోషణ అభియాన్ కార్యక్రమం సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నదని ఆయన తెలిపారు. గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేసేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తుందని, అంగన్వాడీ సూపర్‌వైజర్ లు కేంద్రాలను సందర్శించి లోటుపాట్లను సరిచేయాలని ఆయన అన్నారు. గ్రామాలలో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములై నిర్వహించాలని ఆయన సూచించారు. జిల్లా అధికారులు ప్రత్యేక అధికారులు పర్యటిస్తూ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ప్రస్తుతం 60% న్యూట్రి గార్డెన్ ఉన్నదని, మిగతా 40% పెంపొందించాలని చర్యలు తీసుకోవాలని గర్భిణీలకు, బాలింతలకు తృణధాన్యాలు, ఆకుకూరలు లాంటి పౌష్టికాహారం అందజేయాలని ఆయన తెలిపారు. పౌష్టికాహారం కోసం జడ్పీ నిధుల నుండి కేటాయిస్తున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పోషణమాసం గోడపత్రికలను జడ్పీ చైర్మెన్ ఆర్ లోక్‌నాథ్ రెడ్డి, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూఓ పుష్పలత, సుషిత, సీపీఓ, డీసీపీఓ, సీడీపీఓ, జిల్లా అధికారులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోషణ మాస గోడ పత్రికను అధికారులతో కలిసి విడుదల చేస్తున్న జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి, అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్

## విఆర్ఓలకు ఇచ్చిన మాట నిలుపుకో..

### -సిఐటియు జడ్చర్ల మండల కన్వీనర్ తెలుగు సత్తయ్య

**జడ్చర్ల,సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** అసెంబ్లీ సాక్షిగా విఆర్ఎలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సిఐటియు జడ్చర్ల మండల కన్వీనర్ తెలుగు సత్తయ్య సీఎం కెసిఆర్‌ను డిమాండ్ చేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో విఆర్ఎలు చేపట్టిన దీక్షలకు మంగళవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఆర్ఎలు తరతరాల నుండి ప్రభుత్వానికి, ప్రజలకు సేవ చేస్తున్నారని, వీరిలో అధికంగా ఎస్సీ, ఎస్టీ, బిసి సామాజిక వెనుకబడిన వర్గాల వారేనని పేర్కొన్నారు. కేవలం 10,500ల జీతంతో బ్రతుకీడుస్తున్నారని, విఆర్ఎలు తలెత్తుకుని బ్రతికేలా పేస్కేలు ఇస్తామని, అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కెసిఆర్ గొప్పగా చెప్పి, విఆర్ఎలకు ఇచ్చిన వాగ్దానం రెండు సంత్సరాలైనా అమలు చేయడం లేదని విమర్శించారు. డిగ్రీలు, పిజిలు చదివి ఉద్యోగం చేస్తున్న వారికి విద్యార్హతను బట్టి ప్రమోషన్ ఇస్తామని చెప్పారని, ప్రభుత్వ ఉద్యోగులుగా పిఆర్‌సి ప్రకటించి సంవత్సరాలు గడుస్తున్నా జిఓలు మాత్రం విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి అనేక సర్వేలు చేస్తూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచింది విఆర్ఎలేనని, వారిని అలుసుగా చూడడం సీఎంకు తగదని అన్నారు. విఆర్ఎలకు సిఐటియు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం నాయకులు, విఆర్ఎలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలుగు సత్తయ్య

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**వెల్దండ, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** ఐక్యత పౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ సభ్యులు మూడావత్ మోతిలాల్‌నాయక్, సర్పంచ్ పత్యనాయక్, ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్, గోపాల్‌నాయక్‌లు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 20వ తేదీన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పర్యటించడంతో గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో... కాలనీల్లో సీసీ రోడ్లకు విరాళాలు అందించడంతో పనులను ప్రారంభించామని, నాణ్యతగా, తర్వితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, పవన్, నర్సింహ్మాతో పాటు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

## పిహెచ్‌సి శైలజదేవికి ఘనంగా ఉద్యోగ విరమణ సన్మానం

**చిన్నచింతకుంట,సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిహెచ్ఎన్‌గా విధులు నిర్వహిస్తున్న బొల్లమోని శైలజదేవికి మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పిహెచ్ఎన్ శైలజదేవికి వైద్యాధికారులు బలరాంనాయక్, దిలీప్, సంతోష్, వైద్య సిబ్బందితో పాటు ఆశ వర్కర్లు ఘనంగా ఉద్యోగ పదవి విరమణ కార్యక్రమాన్ని శాలువా, పూలమాలలతో సన్మానం చేశారు. ఈసందర్భంగా డా. బలరాంనాయక్ మాట్లాడుతూ పిహెచ్ఎన్ శైలజదేవి 1988లో చిన్నచింతకుంట పిహెచ్‌సిలో విధుల్లో చేరడం జరిగిందన్నారు. మళ్లీ ఇదే పిహెచ్‌సిలో పదవి విరమణ పొందడం జరిగిందని ఆయన తెలిపారు. నాలుగున్నర సంవత్సరాలు పదవి విరమణ ఉండగా ఆమె స్వచ్ఛందంగా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడం జరిగిందని తెలిపారు. పిహెచ్ఎన్‌గా విధుల్లో చేరి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు ఆరోగ్య సేవలందించడం జరిగిందని కరోనా సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా వైద్య సేవలందించారని ఆమె ప్రజలకు చేసిన సేవలు మర్చిపోలేనివని వైద్య సిబ్బందితో, ప్రజలతోనూ మంచి పేరు, ప్రతిష్టతలు తీసుకురావడం జరిగిందని, మాతో ఉంటూ నేడు పదవి విరమణ పొందడం మాకు చాలా బాధకరంగా ఉందని ఆయన తెలిపారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదని పిహెచ్ఎన్ ఎక్కడ ఉన్నా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిపిఎంఓ శ్రీనివాసులు, ఎంపిహెచ్ఓ విజయేందర్, నేత్రాధికారి కోటరా బాలాజీ, హెల్త్ సూపర్‌వైజర్‌లు కృష్ణయ్యగౌడ్, సలామి, జగదీశ్వరి, ఎల్‌డిసి కంప్యూటర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నిషియన్ మునేశ్వరి, డీఈఓ ప్రవీణ్‌కుమార్, అటెండర్ యాదయ్య, ఆనంద్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



శైలజదేవిని సన్మానిస్తున్న దృశ్యం

## గురుపూజోత్సవం రోజున అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది

### ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అబ్దుల్ అజీజ్



తిర్మలాపూర్ గ్రామ పాఠశాలలో సన్మానిస్తున్న గ్రామస్థులు, ఉపాధ్యాయులు



కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న అబ్దుల్ అజీజ్

**రాజాపూర్, ఆగస్టు 06 , ప్రభాతవార్త:** ఉపాధ్యాయ దినోత్సవం రోజున జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని రాజాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన వార్తతో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తిర్మలాపూర్ పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులను విద్యలో ఉన్నత వంతులుగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేశారు. విద్యతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, గురువులను, తల్లిదండ్రులను గౌరవించడం, పాఠశాలలో హరితహారం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. వీటన్నింటిని గుర్తించి తనకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ముమ్ముందు కూడా విద్యార్థులను మంచి ఉన్నత వంతులుగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందడంతో తిర్మలాపూర్ గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు పలువురు నాయకులు, విద్యార్థులు, పూర్వపు విద్యార్థులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం..**

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన అబ్దుల్ అజీజ్‌కు సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, అదనపు కలెక్టర్ తేజాస్ నందలాల్ పవార్, డీఈవో ఎ.రవీందర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందించారు. కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, తాను చేసిన సేవలను గుర్తించి అవార్డు దక్కడంతో తాను గర్విస్తున్నట్లు చెప్పారు. తనకు అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలలియజేశారు.

## 13న అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నీ

**మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** ఈ ఏడాది నవంబర్ 13న మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నీ నిర్వహించనున్నట్లు మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఆర్గనైజర్, కింగ్‌షోటోకాన్ కరాటే అకాడమీ, స్పోర్ట్స్ ఆల్‌స్టైల్‌మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఇండియా చైర్మన్‌లు కేశవ్‌గౌడ్, జహంగీర్‌పాషాఖాద్రి, మహ్మద్‌ఖాజావుద్దీన్, నిర్వాహకులు మహేష్, సత్తీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పోటీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులతోపాటు శ్రీలంక, బంగ్లాదేష్, నేపాల్, సౌది అరేబియా,ఓమన్,ఫ్రాన్స్, ఉగాండా, ఇరాన్ దేశాల నుండి 2000 మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే రెండవ అంతర్జాతీయ స్థాయి ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ బ్రోచర్‌ను తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మినిష్టర్ మహమూద్ అలీ మంగళవారం ఆవిష్కరించినట్లు వారు తెలిపారు.

## సిపిఐ సీనియర్ నేత ఎం.లింగారెడ్డి మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ వాసి భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత ఎం.లింగారెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. తెలంగాణా సాయుధ పోరాటంలో కళాజాత బృందంలో పనిచేసిన ఆయన కొంతకాలం అజ్ఞాతంలో ఉన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ తాలూకా కార్యదర్శిగా మూడు పర్యాయాలు పనిచేశారు. ఆతర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా 1976నుండి 1999వరకు కొనసాగారు. రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్‌గా లింగారెడ్డి రాష్ట్రస్థాయిలో సైతం పదవి నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా కార్యదర్శిగా ఆయన పలు ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి పార్టీని ప్రజల్లోకి తీసుకు వెల్లారు.కొంత కాలంగా ఆయన నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేటు బిఇడి కళాశాలకు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. లిగారెడ్డి మృతి పట్ల మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి తోపాటు వామపక్ష నేతలు ఇతర పార్టీల నేతలు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## భూత్పూర్ 10వవార్డులో వినాయక నిమజ్జనం

**భూత్పూర్,సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణంలోని పదవ వార్డులో అంబేద్కర్ యువజన సంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహ నిమజ్జన కార్యక్రమం సంఘం సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దళిత నాయకులు దళితరత్న బోరింగ్ నర్సింహులు, మండి ఆటో వెంకటయ్య, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్, గడ్డం యాదయ్య, గడ్డం భీమస్వామి, గడ్డం ఎల్లప్ప, శ్రీను, గడ్డం శ్రీశైలం ఊరేగింపులో పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న దళిత నాయకులు

## నిరుపేద మహిళకు నిత్యావసర సరుకులు అందజేసిన విజెఆర్ వాలంటీర్స్

**ఉట్కూర్,సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మంగళవారం విజెఆర్ ఫౌండేషన్ ద్వారా నిరుపేద కుటుంబానికి చెందిన పద్మమ్మకు చెందిన ఇల్లు ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయింది. దీంతో ఆ కుటుంబం వీధినపడింది. ఇటీవల విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి కుటుంబాన్ని సందర్శించి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం విజెఆర్ ఫౌండేషన్ వాలంటీర్స్ తరపున నిత్యావసర సరుకులు అందజేశారు. నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా విజెఆర్ ఫౌండేషన్ పని చేస్తున్నదని, పేదలకు అండగా నిలుస్తుందని అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వాలంటీర్లు మహ్మద్ హుస్సేన్, మహబూబ్, మహేశ్వర్‌రెడ్డి, హమ్మద్ టైలర్, ఇలియాస్ బీడీ, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

## గణనాథుడికి ప్రత్యేక పూజలు..

**ఖిల్లాఘనపురం, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బజారు ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గత ఆరు రోజులుగా స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు చేస్తూ నిత్యం సాయంకాలం వేళలో ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు కోలాటాలతో అలరించారు. ఆలయ ఆవరణలో అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈనెల 8వ తేదీన గనణాథుడిని నిమజ్జనం చేస్తామని తెలిపారు. వందలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



బజార్ ఆంజేయ స్వామి దేవాలయం ఆవరణలో అన్నదానం

## రాజాసింగ్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయాలి...

**వెల్దండ, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** అక్రమంగా రాజాసింగ్‌పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని బీజేపీ నాయకులు రామకృష్ణ, మల్లేష్, విష్ణుగౌడ్‌లు పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలో మంగళవారం బంద్ చేపట్టగా వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. మండలంలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజాసింగ్‌పై పెట్టిన కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

## ఏకలవ్యను సందర్శించిన కార్యదర్శి రోనాల్డ్ రోస్



విద్యార్థులతో మాట్లాడుతున్న రోనాల్డ్ రోస్

**వెల్దండ, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామ సమీపంలో ఏకలవ్య గురుకుల పాఠశాలను డిప్యూటీ కార్యదర్శి చంద్రశేఖర్‌తో కలిసి గురుకులాల కార్యదర్శి రోనాల్డ్ రోస్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణతో పాటు కళాశాల గదులు, డైనింగ్ హాల్‌తో పాటు పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పాఠశాల ఆవరణలో అర్గానిక్ కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి పాఠశాల ఉపాధ్యాయులు పాటు విద్యార్థులను అభినందించారు. పాఠశాలలోని వసతుల సమస్యలతో పాటు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకట్‌నారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## తెగిన డిండి-నార్లపూర్ కాల్వ...

**వెల్దండ, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామ సమీపంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు కుందారం తాండ వద్ద ఉన్న డిండి-నార్లపూర్ కాల్వ తెగి రాకపోకలకు ఇబ్బంది కలిగింది. భైరాపూర్-అజిలాపూర్ గ్రామాల మధ్యలోని రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గ్రామ సమీపంలో అలుగు పారి భైరాపూర్ - అజిలాపూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అజిలాపూర్ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడం, కాల్వ కూడా తెగిపోవడంతో మండల కేంద్రానికి రావాల్సిన ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో దఫాలుగా అధికారులకు విన్నవించిన ఫలితం లేదని పేర్కొంటున్నారు. కురిసిన వర్షాలకు పత్తి పంటలు నీట మునగడంతో రైతులు బెంబెలు ఎత్తుతున్నారు.



తెగిపోయిన డిండి-నార్లపూర్ కాల్వ